# మాటల ఆసుపత్రి

"**మా**టల అడివి చూసాం గనక మాటల ఆసుపత్రికి కూడా ఒక ప్రదక్షిణం చేసివద్దాం" అన్నాడు నా మార్గదర్శి.

"మాటల ఆసుపత్రి కూడా ఉందా?" అన్నానాశ్చర్యంతో.

మార్గదర్శి అనుమానిస్తూ "ఇంకో మాట దొరక్క దాన్ని ఆసుపత్రి అన్నారే కాని అక్కడ చెప్పుకోదగిన చికిత్స ఏమీ జరగదు. నిజం చెప్పాలిసొస్తే అదోరకమైన రోగుల బందిలి దొడ్డి. అయితే అక్కడ వైద్యులు కూడా ఉన్నారు మరి. కాని వాళ్లు చేసేది చికిత్స కాదు – ఓ విధమైన పరిశోధన" అన్నాడు.

"సరే చూతాం పద!" అన్నాను.

❀ ❀ ❀ ❀ ❀

"మనుష్యులు! వందలకొద్దీ – వేలకొద్దీ – కోట్ల కొద్దీ మనుష్యులు! మాటల ఆసుపత్రి యావత్తూ మహాగందరగోళంగా ఉంది."

"ఇక్కడ, కొద్దిమంది నవనాగరికపు ఆడవాళ్లు తప్ప మొత్తం మీద ఉన్నవాళ్లంతా మగవాళ్లల్లేనే ఉందే?" అన్నాను.

"నిజం! దీనికి కారణం శాస్త్రజ్ఞులు రకరకాలుగా చెప్తున్నారు. ఆడవాళ్లు మగవాళ్లకంటే చాలా అధికంగా మాట్లాడతారనే మాట రుజువైనప్పటికీ, మాటలు వాళ్లలో అనారోగ్యకరమైన వికారాలు పుట్టించలేనట్టు కనబడుతుంది. దీనికి కారణం వాళ్లు అధికంగా మాటకారులు కావడమేనని కొందరి అభిప్రాయం. మాటనలు మగవాళ్లకంటె ఆడవాళ్లు చాలా శాస్త్రీయంగా ప్రయోగిస్తారనీ అందువల్ల వాళ్లలో మాటలు జాస్తిగా ఉద్రేకించ కలిగించలేవనీ, మరికొందరి అభిప్రాయం. మగవాళ్లకంటే ఆడవాళ్లకు జీవిత యదార్థ్యం బాగా తెలుసుననీ, మగవాళ్ల మాదిరిగా వాళ్లు చప్పున ఉద్రేకానికి లోనుకారనీ, ఇంకొందరి అభిప్రాయం. మగవాళ్ల నోట నానా మాటలు పడటం అలవాటయిపోయిన వాళ్లు మాటలకు చలించటం మానేశారనే అభిప్రాయం కూడ లేకపోలేదు. నా అభిప్రాయంలో ఈ కారణాలలో ఏదీ తోసేయటానికి లేదు."

"ఇంకో విషయం కూడా గమనించు! ఇక్కడ బొత్తిగా పామరులైన వాళ్లు బహు తక్కువ. ఉన్నవాళ్లు జాస్తిగా మధ్యతరగతి వాళ్లు – కొద్దిగా పైతరగతి వాళ్లున్నూ. మాటల జబ్బు జాస్తిగా వీళ్లకే చేస్తుందల్లే ఉంది."

"పాతికేళ్ల నుంచి ఒక డాక్టరు మాటల జబ్బుల మీద పరిశోధన చేస్తూన్నాడు. ఈ జబ్బులు మాటలవెంట ఉండే క్రిములవల్ల కలుగుచున్నాయని రుజువు చేతామని ఆయన ఆశ. ఆ ఆశ ఇప్పటివరకు ఫలించలేదు – బహుశా ఇక ఫలించదు. ఈ క్రిములు ఆడవాసూళ్ల, పాటకపు జనాన్ని ఎందుకు బాధించటం లేదని ఇప్పటి కాలపు శాస్త్రజ్ఞులు అడుగుచున్నారు. వీళ్ల ఉద్దేశంలో ఈ ముసలి వైద్యుడు క్రిమి అనే మాటతో బాధపడుతున్నాడు."

"ప్రాయుడూ, అతనికి పేడదిరిగిన కొందరు శిష్యులు చేసిన సిద్ధాంతాలను బట్టి ఈ మాటల రోగాల తత్వం కొంతవరకర్థమవుతున్నది. కాని ఈ మధ్య పంచదార మాత్రల వైద్యుడొకడు వచ్చి ఒక రోగిని కొద్దికాలంలో చిత్రంగా నయం చేసిపోయినాడు. ఆ రోగి ఒక రెండు చెప్పరాని మాటలతో బాధపడుతున్నట్టు ఆ వైద్యుడు నిర్ణయించాడు. ఎందుకంటే ఆ రోగి ఆ మాటలెవరైనా ఉపయోగిస్తే 'హరి హరి' అని చెవులు మూసుకొని గజగజ వణికేవాడు. అతని మొహం కందేది. అతడికామాటలు వింటే ముచ్చెమటలు పోసేవి. ఆ మాటలవల్ల కలిగిన జబ్బు కామాటలే మందని ఆ పంచదార మాత్రల వైద్యుడు నిర్ణయించాడు. ఆ మాటలనే రెండో పొటెన్సీలో – నూరు మాటలలో ఒక్కటి చొప్పున – వాడికి ఆ వైద్యుడా మనిషిని రెండు మూడ నెలల్లో నయం చేశాడు. కాని పంచదార మాత్రల వాణ్ని కషాయాల వాళ్లూ, రంగునీళ్ల వాళ్లూ వెళ్లగొట్టారు. మిగిలిన రోగాలల్లేనే మాట రోగాలు కూడా వాటంతటవి నయం అయ్యే అవకాశం ఉందని ఆ బాగుపడ్డ రోగి అట్లాగే బాగుపడ్డాడని వీళ్ల నమ్మకం..."

"పంచదార మాత్రల వాణ్ని విశ్వసించటానికి మరోకారణం కూడా కన్పిస్తున్నది. ఒకే మాట పెద్ద డోసులలో ఇస్తే రోగాలు పుట్టుకొస్తున్నాయి. అదిగో, ఆ మూల గడ్డపు వాణ్ని చూడు. వాడు పదిహేను రోజులు రామ జపం తప్ప ఏమీ చేయలేదు. రోగం పుట్టుకొచ్చింది. అందరూ అపర వాల్మీకి అన్నారు. కాని చివరకు ఆస్పత్రి పాలయినాడు. వాణ్ని నయం చేసే వాళ్లులేరు.... ఆ పక్క జర్మను వాళ్లు చూడు వాళ్ల దగ్గరికి పోయి, పరుషమైన కంఠంతో 'జర్మనీ, జర్మనీ, జర్మనీ' అని మూడు సార్లు కేక పెట్టావా, వాళ్లంతా కొయ్యబారిపోయి నువ్వేం చెబితే అది చేస్తారు!"

"ఈ జర్మను వాళ్లలో హిట్లరుగానీ, గోబెల్స్ గానీ, ఇతర నాజీ నాయకులుగానీ లేరు. గమనించు. ఈ మాటల రోగులతో వచ్చిన పెద్ద చిక్కే అది; వీళ్లలో మంచివాడు కాని వాడు దాదాపు ఒక్కడూ లేడు. మాటలతో ఇతరులకు పిచ్చెత్తించే వాళ్లూ, మాటలతో లోకాన్ని దోచే వాళ్లూ ఈ ఆసుపత్రిలో లేనేలేరు. వాళ్లంతా ఆరోగ్యంగానే ఉన్నారు - మాటల జబ్బులకు సంబంధించినంత వరకూ, వీళ్లంతా ఈ ఆస్పత్రిలో పడి ఉండటం మూలంగా ఆ దుర్మార్గులు మరింత జయప్రదంగా ప్రపంచాన్ని ఏల గలుగుతున్నారు. ప్రపంచం బాగుపడాలంటే ఈ ఆస్పత్రి ముందు ఖాళీ కావాలనేది నిశ్చయం. దురదృష్టవశాత్తూ ఇక్కడ శాస్త్రీయమైన చికిత్స లేకుండా ఉంది. ఇక్కడ పరిశోధనలు చేస్తున్న వాళ్లే గాని దీక్షగా ఆసుపత్రి బాగుచెయ్యటానికి పూనుకున్నవాడు లేడు..."

"ముఖ్యంగా ఇక్కడున్న పిల్లకాయలను జాగ్రత్తగా గమనించు. వీళ్లలో చాలామంది అప్పుడే తీవ్రమైన మాటల జబ్బులతో బాధపడుతున్నారు. ఈ దశలో వీళ్లను నయం చెయ్యటానికి అవకాశం ఉంది. కానీ దురదృష్టవశాత్తూ, ఈ ఆసుపత్రిలో కూడా వీళ్లమీద వీళ్ల తల్లిదండ్రులకు సంపూర్ణాధికారాలున్నై. ఈ సంపూర్ణాధికారాలు పిల్లల జబ్బులు మరింత చేస్తున్నయ్యేకానీ జరగటం లేదు. ఈ విషయంలో ఆసుపత్రి నియమాలు చాలా లోపభూయిష్టంగా ఉన్నై.

"ఏమంటే ఇక్కడి పరిశోధనల్లో చాలామంది తమ సంపర్కరం ద్వారా పిల్లల్ని సులభంగా బాగు చేయగలరు. కాని ఇక్కడి రోగుల్లో చాలామందికి వీళ్లంటే తగని భయం కావటంవల్ల తమ పిల్లల్ని ఈ పరిశోధకుల ఛాయలకు పోనివ్వరు...

ఆరోగ్యం పొందటానికి భయపడటం ఇక్కడి జబ్బుల ప్రధాన లక్షణమని చెప్పవచ్చు. కాని ఈ లక్షణం చిన్న పిల్లల్లో - అంటే, రోగం ముదరకపూర్వం - అంత స్పష్టంగా కనిపించదు. కనకనే ఇక్కడ ఉండే పిల్ల రోగుల సంఖ్య నానాటికీ తగ్గుతున్నది... ఇదొక్కటే ఈ ఆసుపత్రిని గురించి సంతోషించదగిన అంశం...

"ఈ ఆసుపత్రిని గురించి నిజమైన ఆందోళన ప్రకటిస్తున్న వాళ్లు శాస్త్రజ్ఞులూ కారు. వైద్యులు కారు. మనోవైజ్ఞానికులూ కారూ- మార్క్సిస్టులు. ఈ రోగాల విషయంలో వీళ్ల శ్రద్ధ ప్రకటించటమే గాకుండా, వాటిని ఫ్రాయిడు సిద్ధాంతాలతో ఎటువంటి సంబంధం ఉందో మార్క్సు సిద్ధాంతాలతో కూడా అంత సంబంధం ఉందని వీళ్లు రుజువు చేస్తున్నారు. ఇక్కడి రోగుల్లో చాలామందికి డబ్బు రాకతోనూ, పోకతోనూ ఉన్న రోగాలు పోయి కొత్తరోగాలు వస్తున్నై. మొత్తం మీద జీవిత సంగ్రామానికి మాటల జబ్బులకూ సన్నిహిత సంబంధం ఉన్నట్టే ఉంది!" అన్నాడు నా మార్గదర్శి.

"ఈ మాటల జబ్బు తత్వం నిర్ణయం కాకపోవటం వింతగా ఉంది" అన్నాను.

"ఈ జబ్బును గురించి ఒకటి మాత్రం నమ్మకంగా చెప్పవచ్చు; మాటలు మనస్సులో హరాయింపు కాకుండా అంతర్బుద్ధితో వెళ్లినప్పుడు జబ్బు చేస్తున్నది. బుద్ధి మాటలను హరాయించుకోలేకపోవటానికి ఒక కారణం బుద్ధి బలహీనంగా ఉండటం. రెండో కారణం ఈ వ్యాధిగ్రస్తులు ఉద్రేకం కోసం తాపత్రయపడాలిసిన దుస్థితి కలగటం. వీళ్ల రోజువారి జీవితంలో, ఏమీ ఉద్రేకం లేదు. బుద్ధి ఆరోగ్యం ద్వారా వీళ్లకు తగినంత ఉద్రేకం లభించే అవకాశం ఉంది. కాని ఉద్రేకం దాహం వీళ్ల కంత ఓర్పివ్వదు. అందుచేత క్షుధార్తుడు తిండిని నమలకుండా మింగినట్లు, వీళ్లు క్షణక్షణమూ మాటలను సరిగ్గా పచనం చేసుకోకుండా కబళించి బుద్ధిని అజీర్తిపాలు చేసి ఇట్లా రోగగ్రస్తులైనారు."

"అంటే ఇంతమందీ మాటలను సరిగా ఉపయోగించుకోలేదన్న మాటే?" అన్నాను.

"సందేహమెందుకు? వీళ్లలో ఒక్కడుకూడా మాటలను బుద్ధి బలంతో వాడలేడు. బుద్ధి బలంతో స్వీకరించలేడు. ఎక్కడన్నా ఒకడు కాస్త అటువంటి శక్తి గలవాడు కనిపిస్తే 'ఆహా! ఎంత తెలివిగలవాడురా!' అని ఆశ్చర్యపడి వాణ్ని గురించి ఆలోచించటం మానేస్తారు, వీళ్లింత చచ్చు స్థితిలో ఉండబట్టే పత్రికల్లో ప్రకటించే దౌర్భాగ్యపు ప్రకటనల ద్వారా వ్యాపారమూ, రాజకీయవేత్తల పిచ్చి ప్రేలాపనల ద్వారా ఉద్యమాలూ సాధ్యమవుతున్నయ్యనుకోరాదూ!" అన్నాడు నా మార్గదర్శి.

"ఈ ఆసుపత్రి ఇట్లా అవిచ్ఛిన్నంగా సాగాలిసిందేనా?" అన్నాను.

"చెప్పలెం!... వీళ్లందరికీ ఆరోగ్య సూత్రాలు కల్పించి, క్రమంగా ఆరోగ్యం కల్పించటం దాదాపు అసంభవంగా కనిపిస్తుంది. ఒకవేళ సంభవమైనా... ఈ ఆసుపత్రి ఇట్లా అవిచ్ఛిన్నంగా సాగిపోవటం కోరేవాళ్లు ప్రపంచంలో చాలామంది ఉన్నారు. వీళ్ల సంఖ్య నానాటికీ ఎక్కువవుతున్నది... వాళ్లు పడనివ్వరు! వాళ్లలో మళ్లీ అంతఃకలహాలున్నై, వాళ్లు ఒకళ్లనొకళ్లు, నిర్మూలించుకొంటే – అటువంటిది ఎప్పటికన్నా జరగటం ఉంటే ఈ ఆసుపత్రి బాగుపడుతుంది!... లేదా ప్రళయమైన భూకంపం లాటి విప్లవం ఒకటి జరిగి ఆ దెబ్బకు అందరు రోగులూ ఒక్కసారి కోలుకోవటమైనా జరగాలి!... లేదా, ఇంతమంది రోగులకు పరమహంస క్రియలాటి మంత్రం ఒకటి పుట్టాలి! దానివల్ల ఇప్పుడున్న రోగాలన్నిటినీ మించే రోగం పుట్టినాసరే – దాని మూలంగా ఈ చిల్లర రోగాలు ముదిరితే – ఆ వెనక ఆ పెద్దరోగం జాతికంతకూ ఉండిపోయినా ఈ ఆసుపత్రి ఒకటి అంతమవుతుంది. తరువాత ఆ పెద్దరోగం క్రమేణా దానంతట అదే

హరించుకుపోతుంది... ఈ ఆసుపత్రిలో ఆరోగ్యం లేకపోవటం కొన్ని, రకరకాల రోగాలుండటం ఎక్కువైన దౌర్భాగ్యమేమో అనిపిస్తున్నది!" అన్నాడు నా మార్గదర్శి.

"ఇక్కణ్నించి పెందలాడే తప్పుకుపోదాం పద! లేకపోతే మనం కూడా ఇందులో వాళ్లలో జత అయిపోతామేమో!" అన్నాను.

*రచన : 1943 ?*

*ముద్రణ : కుటుంబరావు సాహిత్యం ఆరవ సంపుటం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, డిసెంబర్ 1994*